
సాక్షి సంగారెడ్డి

శుక్రవారం । 5 । మే । 2023



నేటి నుంచి ఎల్లమ్మ జాతర

కాకతీయుల కాలంలో నిర్మించిన ఆలయంలో శ్రీ రేణుకాఎల్లమ్మ దేవత భక్తుల పూజలందుకుంటోంది. తెలంగాణరాష్ట్రంలోనే ఇక్కడి విగ్రహం పెద్దది.

8లో



దళారులకు అమ్మొద్దు

9లో

దళారులకు ధాన్యం అమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు.

ఒకరికి పాజిటివ్



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం పది మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్ట్‌లు చేశారు. అందులో ఒకరికి పాజిటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 12 మందికి చేసినట్లు చెప్పారు.

న్యూస్‌రీల్

చర్యలు తీసుకోండి

నారాయణఖేడ్: రియల్ ఎస్టేట్ వ్యాపారులు వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చకుండా చర్యలు తీసుకోవాలని సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్ చౌహాన్ ఇచ్చిన వినతి పత్రంపై కలెక్టర్ డాక్టర్ శరత్ స్పందించారు. ధరణి పోర్టల్‌లో రియల్టర్ల క్రయవిక్రయాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గుంటలుగా వ్యవసాయ భూములను విక్రయిస్తున్న వారి వివరాలను సేకరించి చర్యలు తీసుకోవాలంటూ ఉత్తర్వులో పేర్కొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు యాదవరెడ్డి



మనియార్‌పల్లిలో పంటలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

కోహీర్(జహీరాబాద్): అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.యాదవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన రైతు సంఘం జిల్లా కమిటీ బృందంతో మండలంలో పర్యటించారు. వర్షాలకు పాడైన పంటలను పరిశీలించారు. మండలంలో జొన్న, మొక్కజొన్న, మామిడి, చింత, ఉల్లి పంటలతో పాటు, కూరగాయల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. అకాల వర్షాలు, వడగండ్ల వానలకు పంటలు పూర్తిగా పాడైపోయాయన్నారు. పంటనష్టం వివరాలు సేకరించి ఆహార పంటలకు ఎకరాకు రూ.20 వేలు, వాణిజ్య పంటలకు రూ.40 వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మల్లారెడ్డి, సంగమేశ్వర్ రెడ్డి, నాగేష్, మౌలానా, అంజయ్య, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

నేరడిగుంట కార్యదర్శికి డీపీఓ నోటీసు



నేరడిగుంట గ్రామంలో యార్డును పరిశీలిస్తున్న డీపీఓ సురేశ్ మోహన్

జోగిపేట(అందోల్): డంపింగ్ యార్డు నిర్వహణ సరిగా లేదని గ్రామ పంచాయతీ కార్యదర్శి నర్సింహస్వామికి జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్ నోటీసు జారీచేశారు. గురువారం డీపీఓ అందోల్ మండలంలోని నేరడిగుంట గ్రామాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలోని నర్సరీ, డ్రైనేజీలు, రోడ్లు, పారిశుధ్యం, స్మశానవాటిక, డంప్‌యార్డులను పరిశీలించారు. డంప్‌యార్డు నిర్వహణ సక్రమంగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలో సేకరించిన చెత్తను డంప్‌యార్డులో వేసి తడి, పొడి చెత్తలను వేర్వేరుగా చేయాలని ఆదేశించారు. మండలంలో ఎంత మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధులకు హాజరవుతున్నారు. రెగ్యులర్ కార్యదర్శులు ఎంత మంది విధుల్లో ఉన్నారన్న విషయాన్ని తెలుసుకొని నేరడిగుంట గ్రామాన్ని ఎంచుకొని సందర్శించారు. అందోల్ మండల అభివృద్ధి అధికారి సత్యనారాయణ, ఎంపీఓలతో పాటు పలువురు డీపీఓ వెంట ఉన్నారు.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

ఝరాసంగం(జహీరాబాద్): ఉపాధి హామీలో పనులు చేసేందుకు వెళ్లిన కూలీలపై తేనెటీగలు దాడి చేశాయి. ఈ సంఘటన గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని బిడెకన్నె గ్రామ శివారులో ఉపాధి హామీ పనులు చేసేందుకు కూలీలు వెళ్లారు. వాటర్ ట్యాంకు వద్ద వాగులో పూడికతీత పనులు చేస్తున్న కూలీలపై ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. గమనించిన కూలీలు అక్కడి నుంచి పరుగు తీశారు. సుమారు 140 మంది కూలీలు పనులు చేస్తుండగా శోభమ్మ, నర్సప్ప, సుజాత, రవిపై దాడి చేయడంతో గాయపడ్డారు. వారు ఝరాసంగం ప్రభుత్వాసుపత్రికి రాగా వైద్యులు ప్రథమ చికిత్స చేయగా, మెరుగైన చికిత్స కోసం జహీరాబాద్ ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు.



చికిత్స పొందుతున్న కూలీలు

ధాన్యం.. దైన్యం

- వరుస వర్షాలతో వరి నూర్పిళ్లపై ప్రభావం
- కొనుగోలు కేంద్రాలకురాని ధాన్యం
- అయోమయంలో అన్నదాత



కొత్తపల్లి శివారులో నేలకొరిగిన వరి పైరు

నారాయణఖేడ్: వాతావరణ మార్పుల కారణంగా కురుస్తున్న వర్షాలతో రైతుల్లో ఆందోళన నెలకొంది. సాగుచేసిన వరి పంట కోతదశలో ఉండగా అకాల వర్షాలు కుదేలు చేస్తున్నాయి.

- గత పది రోజులుగా కురుస్తున్న వర్షాలు తీవ్ర నష్టాలను మిగుల్చుతున్నాయి. నడి వేసవిలో ఎండలు తీవ్రంగా ఉండే సమయంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని వర్షాలు కురుస్తున్నాయి.
- వాతావరణం సైతం ఒక్కసారిగా చల్లబడింది. వర్షాకాలాన్ని తలపిస్తూ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నెలలో వరి పంట నూర్పిళ్ల జోరుగా సాగి కొనుగోళ్లు ముమ్మరంగా సాగేవి.
- కానీ, వర్షాల కారణంగా పంట నూర్పిళ్లు, కొనుగోళ్లు నిలిచిపోయాయి. జిల్లా మొత్తంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.
- ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు ఎండలు ఎప్పుడు కాస్తాయా అంటూ ఎదురు చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రారంభమైనా సాగని కొనుగోళ్లు

- జిల్లాలో 200 వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇందిరాక్రాంతి పథం ద్వారా 102, డీసీఎంఎస్ ద్వారా 7, మిగతా 91 కేంద్రాలు ప్రాథమిక సహకార సంఘాల ద్వారా ఏర్పాటు చేస్తున్నారు.
- కాగా జిల్లాలోని పలు గ్రాల్లో కొనుగోలు కేంద్రాలను సైతం ఎమ్మెల్యేలు ప్రారంభించారు.
- గత పది రోజుల క్రితం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాగానే వర్షాలు మొదలయ్యాయి.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

దీంతో కేంద్రాలకు వరి ధాన్యం రావడంలేదు.

- చాలా మటుకు రైతులు వరి ధాన్యాన్ని కమతాల్లోనే వదిలేశారు. కోతదశలో ఉన్న పంటను వర్షం కారణంగా రైతులు కోతలు చేపట్టడం లేదు. ఇప్పటికే కోతలు జోరుగా సాగి కేంద్రాలకు రవాణా చేసేవారు.
- కానీ, కేంద్రాలు ప్రారంభమైనా ధాన్యం లేక వెలవెలబోతున్నాయి. ప్రభుత్వం ఏ గ్రేడు వరి ధాన్యంకు రూ.2,061, సాధారణ రకం రూ.2,040లు మద్దతు ధర ప్రకటించింది.
- తడిసిన ధాన్యం సైతం కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ, ధాన్యం మాత్రం కేంద్రాలకు రావడంలేదు. కొన్ని గ్రామాల్లో కోత కోసిన ధాన్యం వర్షాల కారణంగా తడిసింది. కొనుగోలు కేంద్రాలకు తెచ్చే ధాన్యం తేమ శాతం 15 వరకు ఉండాలి.
- కానీ ప్రసుత్తం వర్షాల కారణంగా ధాన్యం తడవడంవల్ల తేమ శాతం 40 వరకు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన కేంద్రాల్లో ధాన్యంను అధికారులు తూకం వేయరు. ఆరబెట్టేందుకు సైతం ఎండలు లేవు.
- చాలామంది రైతులు తమ ధాన్యాన్ని కమతాల్లోనే వదిలేశారు. జిల్లాలో 2 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు.

కోతలు చేపట్టలేదు



వర్షాలకు ధాన్యం తడిసి ఉంది. దీంతో ఇంకా వరి కోతలను చేపట్టలేదు. రెండెకరాల్లో వరి పంటను సాగు చేశాను. పదిరోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఫలితంగా పంటను కమతంలోనే వదిలేశా. వర్షాలు తగ్గి ఎండలు మొదలయ్యాక మరో పక్షం రోజులు కోతలకు సమయం పట్టే అవకాశం ఉంది. వర్షాలు పంటలను దెబ్బతీస్తున్నాయి.

– పి.విఠల్‌రెడ్డి, రైతు, చందాపూర్

ధాన్యం రావడంలేదు



నారాయణఖేడ్ ప్రాంతంలో పలు గ్రామాల్లో ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాం. వర్షాల కారణంగా కోతలు నిలిచాయి. కొంత ధాన్యం తడిసింది. ఇంకా కేంద్రాలకు రైతులు వరి ధాన్యం తీసుకు రాలేదు. ధాన్యం తీసుకువస్తే తేమ శాతం ఆధారంగా కొనుగోళ్ళు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

– టిక్యానాయక్, ఏపీఎం, నారాయణఖేడ్

ఇంటింటికి ఇండియా పోస్ట్ పథకాలు

పోస్ట్ మాస్టర్ జనరల్ టీఎం శ్రీలత

సంగారెడ్డి టౌన్: ఆప్ కా దోస్త్.. ఇండియా పోస్ట్ నినాదంతో ముందుకు సాగుతూ తపాలా శాఖలోని వివిధ పథకాలు ఇంటింటికి చేరేలా ప్రణాళిక రూపొందించి కృషి చేస్తున్నామని, వీటిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ హెడ్ క్వార్టర్స్ రీజియన్ పోస్టుమాస్టర్ జనరల్ టీఎం శ్రీలత అన్నారు. గురువారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి జిల్లా పరిషత్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన గ్రామీణ తపాలా జీవిత బీమా పాలసీలపై నిర్వహించిన ఒకరోజు శిక్షణా తరగతిల్లో మాట్లాడారు. తక్కువ ప్రీమియం, ఎక్కువ బోనస్ అందిస్తున్న గ్రామీణ తపాలా జీవిత బీమా పాలసీలు అర్హులైన ప్రతీ ఒక్కరూ తీసుకునేలా బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు, తపాల ఉద్యోగులు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. బీద, బడుగు సంపన్న వర్గాలు అందరు బీమా పాలసీ తీసుకునేలా వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత పోస్టల్ ఉద్యోగులపై వుందన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా మహిళల కోసం ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా సమ్మాన్ సేవింగ్ అకౌంట్ ద్వారా మహిళల ఆర్థిక ప్రగతికి తోడ్పాటునందించాలని కోరారు. ఆడపిల్లల కోసం సుకన్య సమృద్ధి ఖాతా, మగపిల్లల కోసం పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ మంచి పథకాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్పీ ఎస్‌వీఎల్ ఎస్ రావు, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, బాలకృష్ణ, ఐపీపీబీ మేనేజర్ రాంజీ, ట్రైనర్ చక్రపాణి, సందీప్, అనంత రామ్, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్స్, తపాల ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తృణధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ వెబినార్‌లో డాక్టర్ సతరూప ఘోష్

పటాన్‌చెరు టౌన్: తృణ ధాన్యాలు పోషకాలతో నిండి ఉంటాయని, ఏ వయస్సు వారికైనా సులువుగా జీర్ణమవుతాయని, వాటి వినియోగంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని పశ్చిమ బెంగాల్‌లోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ విశ్వవిద్యాలయం ఫుడ్ సైన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సతరూప ఘోష్ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎఫ్ఎస్ఎ) ఆధ్వర్యంలో తృణధాన్యాలు భవిష్యత్ ఆహారం అంశంపై గురువారం నిర్వహించిన వెబినార్ లో ఆమె మాట్లాడారు. తృణధాన్యాలు అత్యధిక పోషక విలువలు కలిగి ఉన్నాయని, అధిక శక్తిని ఇస్తాయన్నారు. తృణధాన్యాలు శరీర కణజాలాన్ని పునరుత్తేజితం చేస్తాయని, మధుమేహ వ్యాధిని తగ్గిస్తాయని, పిత్తాశయ రాళ్లను నివారించడంతో సహాయపడతాయన్నారు. కార్యక్రమంలో ఫుడ్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఉమామహేశ్వరీ, డాక్టర్ మౌమితా దేవ్, డాక్టర్ పరుల్ థాపర్ పాల్గొన్నారు.



వెబినార్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ డాక్టర్ సతరూప ఘోష్

బీదర్ పోలీసులతో ఎస్పీ సమావేశం



బీదర్ ఎస్పీ, కలెక్టర్‌తో ఎన్నికలపై చర్చిస్తున్న ఎస్పీ రమణకుమార్

జహీరాబాద్ టౌన్: ఎస్పీ రమణకుమార్ కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ పోలీసులతో గురువారం సమావేశమయ్యారు. ఈ నెల 10వ తేదీన రాష్ట్రంలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో సరిహద్దులోగల బీదర్ ఎస్పీ చెన్న బసవన్న, కలెక్టర్ గోవింద్‌రెడ్డిని కలిశారు. రెండు రాష్ట్రాలకు సంబంధించిన నేరస్తుల గురించి చర్చించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పరస్పర సహకారంపై చర్చించారు. సరిహద్దులోగల చెక్‌పోస్ట్ గుండా బోగస్ ఓటర్లు వెళ్లకుండా గట్టి నిఘా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అంతకు ముందు ఎస్పీ రాష్ట్ర సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను తనఖీ చేశారు. ఆయన వెంట జహీరాబాద్ డీఎస్పీ రఘు ఉన్నారు.

పాడి రైతులకు సబ్సిడీ గేదెలు

తెలంగాణ విజయ డెయిరీ డీడీ మోహనమురళి

జహీరాబాద్ టౌన్: విజయ డెయిరీ పాలు సరఫరా చేసిన పాడి రైతులకు సబ్సిడీపై ముద్ర లోన్ ద్వారా గేదెలను పంపిణీ చేస్తున్నట్లు తెలంగాణ విజయ డైరీ జిల్లా డిప్యూటీ డైరెక్టర్(డీడీ) పి.మోహనమురళి అన్నారు. మదిరి గ్రామ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం పాడి రైతులకు ముద్ర లోన్ కింద 18 గేదెలను పంపిణీ చేయగా గురువారం ఆయన యూనిట్‌లను పరిశీలించారు. జహీరాబాద్ పాలశీతలీకరణ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ విజయ డైరీకి పాలు సరఫరా చేసే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 37 శాతం, ఇతరులకు 20 శాతం మార్జిన్ మనీ కింద పీఎంఈజీపీ స్కీం ద్వారా గేదెలను పంపిణీ చేస్తామన్నారు. ఇప్పటికే పలువురు పాడి రైతులు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. విజయ డెయిరీ పాలను పోసి సబ్సిడీపై గేదెలను తీసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన కోరారు. ఆయన వెంట పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ డేవిడ్ విజయ డెయిరీ సూపర్‌వైజర్ బస్వరాజ్ తదితరులు ఉన్నారు.



రైతుతో మాట్లాడుతున్న డీడీ మోహనమురళి

సరిహద్దు చెక్‌పోస్ట్ తనిఖీ

జహీరాబాద్ టౌన్: తెలంగాణ–కర్ణాటక అంతరాష్ట్ర సరిహద్దులో సంగారెడ్డి జిల్లా చిరాగ్‌పల్లి–మాడ్గి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను గురువారం ఎక్సైజ్ కమిషనర్ హరికిషన్ తనఖీ చేశారు. కర్ణాటక రాష్ట్రంలో ఈనెల 10వ తేదీన జరగనున్న సాధరణ ఎన్నికల దృష్ట్యా హైదరాబాద్–ముంబాయి 65వ జాతీయ రహదారిపై ఎక్సైజ్, పోలీసు శాఖలు సంయుక్తంగా చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్టును కమిషనర్ సందర్శించి వాహనాలను తనఖీ చేశారు. ఎన్నికల్లో హవాలా డబ్బు, మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఆయన వెంట ఎక్సైజ్ జహీరాబాద్ సీఐ అశోక్‌కుమార్ ఉన్నారు.



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ కమిషనర్ హరికిషన్

ధాన్యం కొనుగోలు చేయాలి

- డీఆర్డీఓ శ్రీనివాసరావు

హత్నూర(సంగారెడ్డి): ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు తెచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డీఆర్డీఓ శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండల కేంద్రమైన హత్నూర, చిక్ మద్దూర్ గ్రామాలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న తరుణంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టి విక్రయించాలన్నారు. కొనుగోలు కేంద్రాల సిబ్బంది తేమ శాతం పరిశీలించి కొనుగోలు చేయాలన్నారు. రైతులు ధాన్యం విక్రయించిన వెంటనే వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. డబ్బులు సకాలంలో వారి ఖాతాలో పడేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎం జయశ్రీ, ఏపీఎం దేవేందర్, సీసీ కిష్టయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీఓ శ్రీనివాసరావు

పంచవటి పరవశించే..



గంగమ్మకు హారతి ఇస్తున్న భక్తులు

నేటితో ముగియనున్న కుంభమేళా

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రాఘవాపూర్–హుమ్నాపూర్ గ్రామాల శివారులో గల పంచవటి క్షేత్రంలో కుంభమేళా ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 11వ రోజైన గురువారం పంచవటి క్షేత్రం, మంజీరా నది తీరం భక్తులతో కిటకిటలాడింది. ఉత్సవాలు ముగింపు దశకు చేరుకోవడంతో భక్తులు పెద్దఎత్తున కుంభమేళాకు తరలివస్తున్నారు. కుటుంబ సమేతంగా వస్తున్న భక్తులు మంజీర నదిలో పవిత్ర స్నానాలు చేసి గంగాదేవి, పంచవటి క్షేత్రంలో వెలసిన ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి దైవదర్శనం చేసుకుంటున్నారు. ఉదయం నుంచే మంజీరా నది భక్తులతో సందడిగా మారింది. పుణ్య స్నానాలు చేసిన భక్తులు పీఠాధితులు ఇచ్చిన ప్రవచనాలను విన్నారు. గంగాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ఆవరణలో యజ్ఞాలు, హోమాలు కొనసాగాయి. వివిధ ప్రాంతాల నుంచిన భక్తులు దిగంబర సాధువులను దర్శించుకున్నారు. సాయంత్రం సాధువులు హరహర మహాదేవ్ అంటూ నృత్యాలు, విన్యాసాలు చేస్తూ పల్లకితో మంజీర నది వరకు తరలివెళ్లి అందులో పుణ్యస్నానాలు చేశారు.

అనంతరం గంగాదేవికి మహామంగళ హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవాలకు వచ్చిన భక్తులకు అన్నదానం కార్యక్రమం కొనసాగుతుంది.



శంఖం ఊదుతున్న సాధువు

ముగింపు ఏర్పాట్లు

11 రోజులుగా వైభవోపేతంగా కొనసాగుతున్న కుంభమేళా ఉత్సవాలు శుక్రవారంతో ముగియనున్నాయి. శుక్రవారం చివరిరోజు కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చే అవకాశం ఉంది. అందుకు అనుగుణంగా అధికారులు, పంచవటి క్షేత్రం పీఠాధిపతి కాశీనాథ్‌బాబా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

బీదర్ ఉత్తర అసెంబ్లీలో త్రిముఖ పోరు

మొత్తం ఓటర్లు:	2,22,277
పురుషులు:	1,12,554
మహిళలు:	1,09,723

- కాంగ్రెస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే రహీంఖాన్
- బీజేపీ కొత్త అభ్యర్థి ఈశ్వర్‌సింగ్
- జేడీఎస్ తరపున సూర్యకాంత్ నాగ్‌మర్పల్లి
- రసవత్తరంగా మారిన ఎన్నికలు



ఈశ్వర్‌సింగ్ ఠాకూర్



రహీంఖాన్



సూర్యకాంత్ నాగమర్పల్లి

జహీరాబాద్: జహీరాబాద్‌కు పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ అసెంబ్లీకి ఈనెల 10వ తేదీన జరుగుతున్న ఎన్నికల్లో త్రిముఖ పోరు తప్పనిసరైంది. దీంతో ఎన్నిక రసవత్తరంగా మారింది. ఈ నియోజకవర్గంలో ముస్లిం ఓటర్లు అధికంగా ఉండటంతో వారి ఓట్లే కీలకంగా ఉన్నాయి. ప్రతీ ఎన్నికల్లోనూ వారు బలపర్చిన అభ్యర్థులే విజయం సాధిస్తున్నారు. ఈ ఎన్నికల్లోనూ కాంగ్రెస్, జేడీఎస్‌లు వారి ఓట్లపైనే ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి చెందిన రహీంఖాన్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఇప్పుడు ఆయన కాంగ్రెస్ పార్టీ తరపున బరిలో ఉన్నారు. 2008లో కాంగ్రెస్ పార్టీ తరపున, 2013 కేజీపీ తరపున ఎన్నికల్లో గురుపాదప్ప నాగమర్పల్లి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2013లో కేజీపీ తరపున ఆయన గెలుపొందారు. 2016లో గురుపాదప్ప బీజేపీలో చేరారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున రహీంఖాన్ పోటీ చేసి గెలుపొందారు. ఆ ఎన్నికల్లో బీజేపీ తరపున గురుపాదప్ప కుమారుడు సూర్యకాంత్ నాగమర్పల్లి పోటీచేసి ఓటమి పాలయ్యాడు. ఆ ఎన్నికల్లో రహీంఖాన్‌కు 73,270 ఓట్లు రాగా, సూర్యకాంత్ నాగమర్పల్లికి 63,025 ఓట్లు వచ్చాయి.

ముగ్గురి మధ్యే ప్రధాన పోటీ

గత ఎన్నికల్లో ముఖాముఖి పోటీ జరగగా ఈ ఎన్నికల్లో మాత్రం త్రిముఖ పోరు నెలకొంది. ఎవరు గెలిచినా స్వల్ప ఓట్ల తేడాతోనే గెలుపొందుతారనే ప్రచారం సాగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేసిన సూర్యకాంత్ నాగమర్పల్లికి ఈసారి బీజేపీ టికెట్ లభించలేదు. ఆయన స్థానంలో ఓబీసీ వర్గానికి చెందిన ఈశ్వర్‌సింగ్ ఠాకూర్‌కు టికెట్ లభించింది. దీంతో సూర్యకాంత్ నాగమర్పల్లి బీజేపీకి రాజీనామా చేసి జేడీఎస్‌లో చేరి టికెట్ పొందారు. ఆయన కుటుంబానికి ఉన్న గుర్తింపుతో సూర్యకాంత్ విజయాన్ని తనకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇందుకోసం కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ఓట్లను తన వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థి ఈశ్వర్‌సింగ్ ఠాకూర్ సాంప్రదాయ ఓటుతో పాటు హిందువుల ఓట్లను తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న రహీంఖాన్ ముస్లిం మైనార్టీల ఓట్లతో పాటు పార్టీ సాంప్రదాయక ఓట్లపై ఆశలు పెట్టుకున్నారు. కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను ఆశించి భంగపడ్డ శశిపాటిల్ జోలి రెబల్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. అయినా ఆయన ప్రభావం అంతంత మాత్రమేననే అభిప్రాయాన్ని ఓటర్లు వ్యక్తం చేస్తున్నారు. దీంతో త్రిముఖ పోరు రసవత్తరంగా సాగుతోంది.

క్లుప్తంగా

భర్తను చంపినందుకు జీవిత ఖైదు

కంది(సంగారెడ్డి): భర్తను చంపిన కేసులో భార్యకు జీవితఖైదు, రూ.500లు జరిమాన విధిస్తూ జిల్లా న్యాయమూర్తి ఎస్ శశిధర్ రెడ్డి తీర్పు వెలువరించినట్లు ఇంద్రకరణ్ ఎస్‌ఐ రాజేష్ నాయక్ తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం..ఫిబ్రవరి 2019లో కంది మండలంలోని చేర్యాలలో మూడ జయమ్మ తనభర్త నర్సింలు(45)ను హత్య చేసింది. అప్పటి ఎస్‌ఐ దశరథ్ కేసునమోదు చేసి నిందితురాలిని కోర్టులో ప్రవేశపెట్టారు. కేసును విచారించిన జిల్లాన్యాయమూర్తి ఎస్ శశిధర్ రెడ్డి ఆమెకు జీవితఖైదు తోపాటు రూ.500ల జరిమాన విధిస్తూ గురువారం తీర్పు విలువరించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వరిపంట తొక్కించిన వ్యక్తిపై కేసు

రామాయంపేట(మెదక్): వరిపంటను హిటీచీతో చెడగొట్టిన వ్యక్తిపై గురువారం నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. నార్సింగి ఎస్‌ఐ నర్సింలు తెలిపిన వివరాల ప్రకారం.. నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెడ్డిపల్లి వడ్డెర కాలనీ వాసుడైన లక్ష్మీనరసింహా తన వ్యవసాయ భూమిలో వరిపంట సాగు చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన నరేందర్ పాత కక్షలతో హిటీచీతో అతని వరిపంటను ధ్వంసంచేశాడు. ఈ విషయంపై బాధితుడు లక్ష్మీనరసింహా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ నరేందర్‌పై కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి జరిమానా

సిద్దిపేటకమాన్: డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన మందుబాబులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో కార్యాలయ చౌరస్తాతో పాటు రాజీవ్ రహదారిపై ఐదు రోజుల క్రితం డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించామన్నారు. ఈ తనిఖీల్లో 18 మంది మందుబాబులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని గురువారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.42,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

లారీ టిప్పర్ ఢీ.. ఒకరికి గాయాలు



పాపన్నపేట(మెదక్): లారీ టిప్పర్ ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలైన సంఘటన గురువారం యూసుఫ్‌పేట శివారులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాపన్నపేట వైపు నుంచి వస్తున్న లారీ..మెదక్ వైపు నుంచి వస్తున్న టిప్పర్ యూసుఫ్‌పేట శివారులో అదుపుతప్పి ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో పెద్దశంకరంపేటకు చెందిన టిప్పర్ డ్రైవర్ పోచయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 వాహనంలో బాధితున్ని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

బైక్‌పై నుంచి పడి సర్పంచ్‌కు గాయలు

కల్హేర్(నారాయణఖేడ్): బైక్‌పై నుంచి కింద పడి సంగెం సర్పంచ్ బిరదర్ రవీందర్‌రావు పాటీల్‌కు గాయలయ్యాయి. గురువారం సాయంత్రం సిర్గాపూర్ జీవుల తండా సమీపంలో సంఘటన జరిగింది. స్థానికులు చికిత్స నిమిత్తం నారాయణఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నేటి నుంచి ఎల్లమ్మ జాతర



రేణుకాఎల్లమ్మ విగ్రహం



హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ దేవాలయం

హుస్నాబాద్: కాకతీయుల కాలంలో నిర్మించిన శ్రీ రేణుకాఎల్లమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్నారు. తెలంగాణలోనే ఇక్కడి విగ్రహం పెద్దది. రేణు అంటే సంస్కృతంలో ఇసుక అని అర్థం. అమ్మవారు జమదగ్ని ఆజ్ఞతో ప్రతి రోజూ ఇసుకతో కుండను తయారు చేసి నీళ్లను తీసుకెళ్తూ ఉండేది. అందుకే అమ్మవారిని రేణుకా దేవిగా, రేణుకాంబగా చెబుతుంటారు. ఎల్లమ్మ అంటే ఎల్లరకు (అందరికీ) అమ్మగా పూజలందుకుంటుంది. ప్రతి సంవత్సరం వైశాఖ పౌర్ణమిన రేణుకాఎల్లమ్మ జాతర నిర్వహిస్తారు. ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభమై జూన్ 4 వరకూ నిర్వహించనున్నారు. కాకతీయుల కాలంలో రాణి రుద్రమ దేవి పర్యవేక్షణలో ఆలయ నిర్మాణం జరిగినట్లు చరిత్ర చెబుతుంది. ఈ కాలంలోనే నిర్మించిన చెరువుకు ఎల్లమ్మ చెరువుగా నామకరణం చేశారు.

భక్తుల పాలిట కల్పవల్లి

తెలంగాణలోనే ప్రసిద్ధిగాంచిన రేణుకాఎల్లమ్మ జాతరకు వివిధ రాష్ట్రాల, జిల్లాల నుంచి భక్తులు వస్తుంటారు. శ్రీ రేణుకాఎలమ్మ దుష్ట శక్తుల పాలిట, మహాకాళిగా భక్తుల పాలిట కల్పవల్లిగా కోరిన కోర్కెకలు తీర్చే ఎల్లమ్మతల్లిని కొంగు బంగారంగా కొలుస్తున్నారు. ఈ నెల 5న సోమవారం వైశాఖ ఘటంతో ఆలయ ప్రవేశం ఉంటుంది. గణపతి పూజ, పుణ్యాహవచనం, దృష్టి కుంభం, శ్రీ రేణుకా ఎల్లమ్మ, జమదగ్ని మునిరాజుల దివ్య కల్యాణం(సిద్దోగం) జరుగును. ప్రతీ ఆది, మంగళ, శుక్రవారాల్లో విశేష పూజలు నిర్వహిస్తారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం



ఎల్లమ్మ జాతర వైభవంగా నిర్వహించేందుకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. జాతరకు వివిధ దుకాణాల నిర్వాహణకు టెండర్ల ద్వారనే ఎంపిక చేశాం.

– పరమేశ్వర్, ఆలయ పూజారి

విద్యుత్ దీపాల వెలుగులో దేవాలయం

ఎల్లమ్మ జాతరను వైభవంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయంతో పాటు ఆలయ పరిసర ప్రాంతాలను విద్యుత్ దీపాల వెలుగులతో అందంగా అలంకరించారు.

అనారోగ్యంతో స్వాతంత్ర సమరయోధుడు మృతి



చల్ల వీర్‌సంగప్ప(ఫైల్)

టేక్మాల్(మెదక్): భారత స్వాతంత్ర సమరయోధుడు టేక్మాల్ గ్రామానికి చెందిన చల్ల వీర్‌సంగప్ప(97) గురువారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. టేక్మాల్‌లోని 17మంది స్వాతంత్ర్య సమర యోధులలో ఒకడిగా ఉన్నా వీర్‌సంగప్ప ఉద్యమంలో కీలక పాత్ర పోషించాడు. ఉద్యమ సమయంలో టేక్మాల్ వేదికగా ఎన్నో సమావేశాలు నిర్వహించి, పలుమార్లు జైలుకు వెళ్లినట్లు తెలిపారు. గత కొన్నేళ్లుగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన చికిత్స అనంతరం తన స్వగృహంలో మృతిచెందాడు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

పలువురి సంతాపం

స్వతంత్ర్య సమర యోధుడు వీర్‌సంగప్ప మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీపీ చింత స్వప్న, జెడ్పీటీసీ సర్వని సరోజ, సర్పంచ్ నాయికోటి సుప్రజ, ఎంపీటీసీల ఫోరం జిల్లా ఉపాధ్యక్షురాలు నిమ్మ వాణి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిమ్మ రమేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు భక్తుల వీరప్ప, మండల కో–ఆప్షన్ సభ్యులు మజహర్, మాజీ జెడ్పీటీసీ ముఖ్తార్, మాజీ కో–ఆప్షన్ సభ్యులు సలీమ్, నాయకులు సాగర్, కిషోర్, సుధాకర్, భాస్కర్, రవి, సిద్ధయ్య తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

అదృశ్యమైన వృద్ధుడు ఆత్మహత్య



లింగాల పోచయ్య (ఫైల్)

రామాయంపేట(మెదక్): అదృశ్యమైన వృద్ధుడు ఉరివేసుకొని మృతి చెందిన ఘటన 22రోజుల తరువాత వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ రంజిత్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హవేళీ ఘన్‌పూర్ మండలం కూచంపల్లి గ్రామానికి చెందిన లింగాల పోచయ్య (60) గత నెల 12న తన భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బంధువులు, తెలిసిన వారి వద్ద అతని ఆచూకీ కోసం గాలించిన ఫలితం లేదు. దీంతో గత నెల 24న హవేళీ ఘన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్నారు. ఈ క్రమంలోనే గురువారం ఉదయం తొనిగండ్ల గ్రామశివారులోని గోగుల గుట్టపై కేబుల్ వైరుతో చెట్టుకు ఉరివేసుకొని ఉన్న మృతదేహాన్ని కొందరు చూసి పోలీసులకు సమాచారం అందజేశారు. ఉరివేసుకొని చాలారోజులు కావడంతో మృతదేహం కుళ్లిపోయి పురుగులు పట్టి ఉంది. ఈ విషయం తెలుసుకున్న మృతుడి కుమారుడు వసంతకుమార్ సంఘటనాస్థలానికి చేరుకొని తన తండ్రి మృతదేహంగా గుర్తించాడు. కుమారుని ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న జేపీఎస్‌ల సమ్మె

సిద్దిపేటరూరల్: జేపీఎస్‌లు రెగ్యులరైజేషన్ కోసం సమ్మె కొనసాగిస్తున్నారు. గురువారం వినూత్నంగా ముగ్గులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ వద్ద రంగురంగుల ముగ్గులు వేసి తమ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తమను రెగ్యులరైజ్ చేసేంత వరకూ శాంతియుతంగా తమ సమ్మె కొనసాగిస్తామన్నారు.

తమ సమ్మెకు పార్టీలకతీతంగా నాయకులు, సర్పంచ్‌లు సంఘీభావం తెలుపుతున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. నర్సాపూర్ సర్పంచ్ పూడూరు మల్లేశం, కపూర్ నాయక్‌తండా సర్పంచ్ సంతోష్ నాయక్, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ కమిటీ కోకన్వీనర్ నరసింహారెడ్డి, డీసీసీ సిద్దిపేట ఓబీసీ జిల్లా అధ్యక్షుడు సూర్య వర్మ, సీపీఎం జిల్లా అధ్యక్షుడు రాళ్లబండి శశిధర్, ఉపాధ్యక్షుడు రవీందర్, జిల్లా సుతారి సంగం అధ్యక్షుడు వెంకటేశం, దళిత జన సమితి జిల్లా అధ్యక్షుడు బొజ్జ యాదగిరి తదితరులు సంఘీభావం తెలిపారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలి



మాట్లాడుతున్న సాయిలు

కొండాపూర్(సంగారెడ్డి): జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి సాయిలు అన్నారు. గురువారం కలెక్టరేట్ వద్ద సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు 9300 మంది పరీక్షలు రాసి రిక్రూట్ అయ్యారని మూడు సంవత్సరాల్లో రెగ్యులర్ చేస్తామన్న ప్రభుత్వం నాలుగు సంవత్సరాలు గడిచినా నేటికీ రెగ్యులర్ చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా రెగ్యులరైజ్ చేయాలని కోరారు. యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణు, తదితరులు తెలిపారు.

పార్ట్‌టైం జాబ్ ఉందంటూ మోసం

- సైబర్ వలలో చిక్కిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు
- పెద్ద మొత్తంలో నగదు పోగొట్టుకున్న వైనం

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ ఉందంటూ అపరిచిత వ్యక్తి నుంచి వచ్చిన వాట్సాప్ మెసేజీకు స్పందించి సాఫ్ట్ వేర్ ఉద్యోగి రూ.4లక్షల 20వేలు, మరో ఉద్యోగి రూ.లక్ష 30వేలు పోగొట్టుకున్న ఘటన అమిన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బీరంగూడకు చెందిన ఓ సాఫ్ట్ వేర్ ఉద్యోగికి ఏప్రిల్ 22వ తేదీన పార్ట్ టైం జాబ్ ఉందంటూ మెసేజ్ వచ్చింది. అది నమ్మిన ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. ఇచ్చిన టాస్కులను పూర్తిచేశాడు. చివరికి తను పెట్టిన రూ.4లక్షల 20వేలను, రెట్టింపైన నగదు ఇవ్వాలని కోరగా గుర్తుతెలియని వ్యక్తి నుంచి స్పందన లేదు. దీంతో తను మోసపోయినట్టుగా గుర్తించి సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేశాడు.

మరో ఉద్యోగి..

అమీన్ పూర్ మండలం కిష్టారెడ్డిపేటకు చెందిన మరో సాఫ్ట్ వేర్ ఉద్యోగికి ఏప్రిల్ 26వ తేదీన పార్ట్ టైం ఉద్యోగం ఉందంటూ మెసేజ్ వచ్చింది. దీనికి తన వివరాలను నమోదు చేశాడు. అపరిచిత వ్యక్తులు చెప్పిన విధంగా నగదు పెడుతూ, టాస్కులు చేస్తూ వచ్చాడు. చివరకు తను పెట్టిన రూ.లక్ష 30వేలను, రెట్టింపైన నగదు ఇవ్వాలని కోరగా గుర్తుతెలియని వ్యక్తులు స్పందించలేదు. దీంతో ఆ బాధితుడు మోసపోయినట్టు గుర్తించి అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు సీఈఐఆర్‌తో గుర్తింపు

దుబ్బాక: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను దుబ్బాక పోలీసులు సీఈఐఆర్ యాప్‌తో గురువారం బాధితులకు అందజేశారు. దుబ్బాక ఎస్‌ఐ బత్తుల మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం..దుబ్బాక మండల గంభీర్‌పూర్ చెందిన నీరటి చిన్న ఎల్లయ్య, చీకోడ్ గ్రామానికి చెందిన బండ రాజు సెల్‌ఫోన్‌లను పోగుట్టుకోవడంతో దుబ్బాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ మహేందర్ సీఈఐఆర్ పోర్టల్ యాప్‌లో వివరాలు నమోదు చేసి ఫోన్‌లను బ్లాక్ చేయించారు. ఫోన్‌లు దొరికిన వ్యక్తులు అందులో సిమ్ తీసి వారి వారి సిమ్‌లు వేయడంతో వారి ఫోన్ నెంబర్, వివరాలు పోలీసులకు తెలిశాయి. దీంతో పోలీసులు వెంటనే వారిని గుర్తించి ఫోన్‌లు స్వాధీనం చేసుకుని పోగొట్టుకున్న వ్యక్తులకు ప్పగించారు. ఈ సందర్భంగా ఎస్సై మహేందర్ మాట్లాడుతూ..సెల్ ఫోన్ పోయిన వ్యక్తి వివరాలను నమోదు చేసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

దుబ్బాకరూరల్: మండలంలోని గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన నీరటి చిన్న ఎల్లయ్య, చీకోడ్ గ్రామానికి చెందిన బండ రాజు ఇటీవల తమ ఫోన్లను పోగొట్టుకున్నారు. వారు దుబ్బాక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ మహేందర్ సీఈఐఆర్‌తో రికవరీ చేసి బాధితులకు అందజేశారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో నివాసం ఉంటున్న ఉపాధ్యాయుడు ఎబినైజర్ గదక్ తండాలోని ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించాడు.

క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే

జహీరాబాద్ ప్రాంతంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని ఎమ్మెల్యే మాణిక్‌రావు పరామర్శించారు. ఖలీల్‌పూర్‌కు చెందిన లాజర్, హోతి(బి)కి చెందిన సుమిత్రమ్మలు రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఎమ్మెల్యే పరామర్శించారు.

పిడుగు పాటుకు మేకల మృతి



మృతి చెందిన మేకలు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని దాచారంలో గురువారం పిడుగు పడి మేకలు మృతి చెందాయి. వివరాలు ఇలా ఉన్నాయి..దాచారంలో ఉంటున్న సన్నాయి రామచంద్రం ప్రతి రోజులాగానే తోటపల్లి రిజర్వాయర్ శివారు భూమిలోకి మేకలను మేపుతుంటాడు. గురువారం మధ్యాహ్నం భోజనం చేస్తుండగా చలి పిడుగు పడి 5 మేకలు మృత్యువాత పడ్డాయి. సమాచారం తెలుసుకున్న స్థానిక ఎంపీటీసీ కొలిపాక రాజు సంఘటనా స్థలానికి చేరుకొని బాధితుడిని పరామర్శించాడు. ప్రభుత్వం నుంచి సాయం అందించాలని బాధితుడు కోరాడు.

చేపలు పట్టేందుకని వెళ్లి నీట మునిగి..



నర్సింలు మృతదేహం

మెదక్ రూరల్: చేపలు పట్టేందుకని వెళ్లి నీట మునిగి మృతి చెందిన సంఘటన మెదక్ మండలం కొంటూరు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన పున్న నర్సింలు(45) కొంటూరు చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి కాళ్లకు వల చిక్కుకొని నీటిలో మునిగి చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న ఇద్దరు..

చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఇద్దరు మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి..



దొరగొల్ల ఎల్లం మృతదేహం

చేగుంట(తూప్రాన్): చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన దొరగొల్ల ఎల్లం(22) ఏప్రిల్ 28న చేగుంట శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకట్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నర్సాపూర్ రూరల్‌లో..



శ్రీకాంత్‌గౌడ్ (ఫైల్)

నర్సాపూర్ రూరల్: మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..నర్సాపూర్ మండలం చిన్నచింతకుంట గ్రామానికి చెందిన బెంది శ్రీకాంత్ గౌడ్ (35) మూడు నెలల క్రితం సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామ సమీపంలోని ఓ కంపెనీలో విధులు ముగించుకొని బైక్‌పై ఇంటికి వస్తుండగా నర్సాపూర్ అటవీ ప్రాంతంలోని కసిల్లా ఫామ్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని చికిత్స నమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం రాత్రి మృతిచెందాడు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



ఆంజనేయులుగౌడ్ (ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): ఆర్థిక ఇబ్బందులు తాలలేక అద్దె ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని శాలిపేట గ్రామానికి చెందిన ఆంజనేయులుగౌడ్(30) గవ్వలపల్లిలో అద్దె ఇంట్లో ఉంటూ ఆర్థిక ఇబ్బందులతో పాటు ఒంటరిగా ఉంటూ మానసికవేదనకు గురయ్యేవాడని ఈ క్రమంలోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు. తల్లి రాగుల సుజాత ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

సంగారెడ్డి టౌన్: గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన సంఘటన సంగారెడ్డి మండలంలోని కలబబ్‌గూర్ శివారులోని చెరువులో చోటుచేసుకుంది. సంగారెడ్డి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గుర్తుతెలియని వ్యక్తి (35) మృతదేహం మండలంలోని కలబబ్‌గూర్‌లో లభ్యమయినట్టు పేర్కొన్నారు. మృతుడు నలుపు రంగు షర్టు, నలుపు రంగు పాయింటు ధరించి ఉన్నాడన్నారు. సుమారు 15 రోజుల క్రితమే చనిపోయినట్టుగా మృతదేహాన్ని బట్టి పోలీసులు విచారణలో పేర్కొన్నారు. గ్రామ వీఆర్‌ఏ మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. సంబంధికులు ఎవరైనా ఉంటే 8712656719, 8712656746 నెంబర్లపైగానీ, సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

ఆటో డ్రైవర్ అదృశ్యం

మెదక్ రూరల్: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఆటో డ్రైవర్ అదృశ్యమైన సంఘటన మెదక్ మండలం మంబోజిపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన గంజి నర్సింలు(26) ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 3వ తేదీన ఆటో నడిపేందుకని ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో చుట్టుపక్కల ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. సోదరుడు శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

వెల్దుర్తి(తూప్రాన్): బండపోసాన్‌పల్లి గ్రామానికి చెందిన పద్మారావ్ తన గేదెలను రోజుమాదిరిగా మేతకు తీసుళ్లాడు. గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ పొలంలో తెగిపడిన విద్యుత్ తీగలను తాకి పాడిగేదె అక్కడికక్కడే మృతి చెందింది. పాడిగేదె విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని, తనను ప్రభుత్వం ఆదుకోవాలని బోరున విలపించాడు.

గరుడ ధ్వజారోహణం.. నేత్రపర్వం

వైభవంగా వేణుగోపాలుని బ్రహ్మోత్సవాలు



వర్గల్ వేణుగోపాలుని కోవెలలో ధ్వజారోహణలో భక్తులు

వర్గల్(గజ్వేల్): వర్గల్ వేణుగోపాలుని కోవెలలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో రెండో రోజు గురువారం ధ్వజారోహణను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకస్వాములు ఆలయ ధ్వజ స్తంభం వద్ద గరుడాళ్వారుకు ప్రత్యేక పూజలు జరిపారు. గరుడ ముద్దలు ఎగురవేశారు. గరుడ పతాకాన్ని ధ్వజస్తంభం పైకి ఆరోహణం చేశారు. ముక్కోటి దేవతలకు శ్రీవేణుగోపాలుని బ్రహ్మోత్సవ ఆహ్వానం చేరవేశారు. వేడుకల్లో భక్తులు పాల్గొని తరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



అజాముద్దీన్ (ఫైల్)

ములుగు(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన ములుగు సమీపంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద రాజీవ్ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అడవిమజీద్‌కు చెందిన ఎండీ అజాముద్దీన్(19) ములుగు నుంచి జగదేవ్‌పూర్ వైపు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ములుగు శివారులోని తహసీల్దార్ కార్యాలయం వద్దకు రాగానే వెనుక నుంచి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో అజాముద్దీన్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు.

రేగొండ ఊరచెరువులో మట్టి తవ్వకాలు

పట్టించుకోని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు



జేసీబీతో మట్టిన్ని తోడుతున్న దృశ్యం

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం రేగొండ ఊరచెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా కొంత మంది జేసీబీలతో మట్టిని తోడేస్తున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంతో ఈ తంతు జరుగుతుందని స్థానికులు వాపోతున్నారు. మట్టి పేరుతో చెరువును కబ్జా చేస్తున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మట్టి తవ్వకాల వల్ల చెరువులో చేపల పెంపకం ఇబ్బందిగా మారుతుందని ముదిరాజ్ కుటుంబీకులు చెబుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ సంజీవ్‌కుమార్‌ను సంప్రదించగా మట్టి తవ్వకాలపై రైతులు ఫిర్యాదు చేయడంతో వెంటనే నిలిపివేశామన్నారు. ఈ విషయంలో ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు.

కొడుకులను నొప్పించలేక ఇల్లు విడిచిన తండ్రి

ఊరు శివారున మంటల్లో మాడిపోయిన వైనం

హుస్నాబాద్‌రూరల్: వృద్ధాప్యంలో కొడుకులను నొప్పించలేని తండ్రి ఎవరికీ చెప్పకుండానే ఇల్లు విడిచి వెళ్లాడు. ఊరు శివారులో మంటల్లో మాడిపోయి చనిపోయిన సంఘటన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం మేడబోయిన వెంకటయ్య(90)కు నలుగురు కొడుకులు, ఒక కూతురు. వీరి పిల్లలతో కలుపుతే వెంకటయ్య బలగం పెద్దగానే ఉంటుంది. ముప్పై ఏళ్ల కిందటనే భార్య మరణించడంతో పెద్ద కొడుకు దగ్గరే వెంకటయ్య ఉంటున్నాడు. కొడుకులకు ఆస్తుల పంపకాల తర్వాత కూడా పెద్ద కొడుకు దగ్గరనే ఉండటానికి ఇష్టపడేవాడు. పెద్దల మాటను కాదనలేక నలుగురు కొడుకుల దగ్గర ఒక్కొక్క నెల ఉండేందుకు అంగీకరించినా ఆయన మనస్సు ఒప్పుకోలేదు. ఇలా ప్రతి నెలా ఒక కొడుకు ఇంటి వద్ద జీవనం సాగిస్తున్న వెంకటయ్య 2వ కొడుకు ఇంటి నుంచి 3వ కొడుకు ఉండే నవాబుపేటకు పోవాల్సి ఉంది. వెంకటయ్యకు ఉన్న ఊరును విడిచి వెళ్లేందుకు మనస్సు ఒప్పలేదు? కొడుకులను ఇబ్బంది పెట్టడం నచ్చక ఇంటి నుంచి వెళ్లిపోయిన వెంకటయ్య ఊరు శివారులో మంటల్లో కాలి శవమయ్యాడు. నాన్న కోసం వెతుకుతున్న కొడుకులకు గురువారం సాయంత్రం కాలిపోయిన శవం కనిపించినట్లు గ్రామస్తులు తెలిపారు. పోలీసులకు సమాచారం అందించగా ఏఎస్‌ఐ సురేందర్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేశ్ తెలిపారు.